


# ఒక మనిషి ఇద్దరైతే

"హలో ప్రదీప్...." అంటూ లాబ్‌లోకి ప్రవేశించాడు ప్రశాంత్. ప్రదీప్ ఏమీ పలకలేదు. కనీసం వెనుదిరిగి కూడా చూడలేదు.అసలు ప్రశాంత్ రాకనే గమనించలేదు. ఎదురుగా ఉన్న టి.వి స్క్రీన్ మీద ఇ.సి.జి ఫ్లక్చుయేషన్స్‌ని సీరియస్‌గా గమనిస్తున్నాడు. పరిస్థితిని గ్రహించాడు ప్రశాంత్. మిత్రుని డిస్టర్బ్ చేయడం ఇష్టంలేక చప్పుడు కాకుండా స్టూలుమీద నెమ్మదిగా కూర్చున్నాడు.

ఐదునిమిషాలు గడిచింది. టి.వి.ని ఆఫ్‌చేసి లేచినుంచున్నాడు ప్రదీప్. వెనుదిరిగేసరికి ప్రశాంత్ కనిపించాడు.

"హలోప్రశాంత్.... ఎంతసేపైంది వచ్చి?" అనడిగాడు.

"ఇప్పుడిప్పుడేలే. ఎవరు వచ్చిందీ. ఎవరు పోయిందీ తెలుసుకునే స్థితిలో ఉన్నావా నువ్వు? ఇలాగే ఇంట్లో కూర్చుంటే దొంగలు పడి దోచుకుపోయినా తెలియదు." అన్నాడు ప్రశాంత్ నవ్వుతూ.

"దాచుకున్నదేమైనా ఉంటేగా దోచుకుపోవడానికి ఇంట్లో ఉండేవి కూడాఇవేగా. టెస్ట్‌ట్యూబులు, కెమికల్స్, సైన్టిఫిక్ ఎక్విప్‌మెంట్ వగైరా. వాటిని దోచుకుపోవాలంటే నీవంటి సైన్టిస్టే రావాలి." అన్నాడు ప్రదీప్ నవ్వుతూ.

"అది సరేకాని... అంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావు. దేన్ని గురించి?" అని అడిగాడు ప్రశాంత్ కుతూహలంతో.

"ప్రశాంత్. ఈ రోజు నాకు ఎంత ఆనందంగా ఉందో చెప్పలేను. నా పరిశోధనలో నేను విజయం సాధించాను. ఇది ప్రపంచగతినే మార్చి వేస్తుంది". అన్నాడు ప్రదీప్ పట్టరాని ఆనందంతో మిత్రుని భుజాలు పట్టుకుని కుదిపివేస్తూ.

"నువ్వు చేస్తోంది మెదడు మార్పిడిని గురించిన పరిశోధన అని నాకు తెలుసు. బ్రెయిన్‌ట్రాన్స్‌ప్లాంట్‌ని సక్సెస్‌ఫుల్‌గా చేయగలిగానా?" అనడిగాడు ప్రశాంత్ విభ్రమంతో.

"అవును. ఇలారా. " అంటూ ముందుకి నడిచాడు ప్రదీప్. ప్రశాంత్ అనుసరించాడు.

"ఇదుగో... ఈ గ్లాస్‌కేసులో కుందేలుంది చూశావా?" అన్నాడు గ్లాస్‌కేసులోకి చూశాడు ప్రశాంత్.



అనస్థీషియా ఇచ్చిన తెల్లనికుందేలు ఒకటి అచేతనంగా, ముడుచుకుని కూర్చున్న విధంగా ఉంది. దాని తలపైన ఆపరేషన్ చేసి కుట్టినచిహ్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దాని తలకు అటూ ఇటూ హెడ్‌ఫోన్' వంటివి ఉన్నాయి. వాటినుంచి దగ్గరలోని టి.వి.కి కనెక్టింగ్ వైర్‌లు ఉన్నాయి. ఆ టి.వి. స్క్రీన్ వంకే అంతవరకూ ప్రదీప్ చూస్తూ ఉంది.

" ఈ కుందేలుకి బ్రెయిన్‌ట్రాన్స్‌ప్లాంట్ చేశాను. ఇంతకుముందు ఎన్నో ప్రయత్నాలు, ప్రయోగాలు చేశాను కాని ఏదీ పూర్తిగా సక్సెస్‌ఫుల్ కాలేదు. ఈసారి సెంట్‌పర్సెంట్ సక్సెస్ సాధించాను. " అన్నాడు ప్రదీప్ విజయగర్వంతో.

"రియల్లీ! కంగ్రాట్యులేషన్స్. ఈ ట్రాన్స్‌ప్లాంట్ ఎప్పుడు జరిగింది?" అనడిగాడు ప్రశాంత్ ఆనందాతిరేకంతో.

"72 గంటలయింది. బాడీఫంక్షన్స్ అన్నీ నార్మల్‌గా ఉన్నాయి. కొత్త మెదడు కొత్తతలలో చక్కగా అతుక్కుంది. ఇప్పుడు మనుష్యులకి కూడా బ్రెయిన్‌ట్రాన్స్‌ప్లాంట్ సాధ్యమవుతుంది. ఇంక నా కృషి ఆ దిశలోనే సాగుతుంది."

"ఇందాక టి.వి. స్క్రీన్‌మీద ఇ.ఇ.జి.ని చాలా సీరియస్‌గా చూస్తున్నావు. అందులో ఏమన్నా విశేషం ఉందా?"

"ఎలక్ట్రోఎన్‌సెఫెలోగ్రాఫ్ (ఇ.ఇ.జి) మెదడునుంచి వచ్చే విద్యుత్తరంగాలను వేవ్స్ గా చూపిస్తుంది కదా! ఇందాక నేను చూస్తున్నది ఈ కుందేలుకి కొత్తమెదడు అమర్చాక తీసిన గ్రాఫ్ ఇదిగో ..... ఈ ఇ.ఇ.జిని చూడు. ఇది ఈ కుందేలుకి ఆపరేషన్ చేయకముందు తీసిన గ్రాఫ్. అంటే పాతమెదడు గ్రాఫన్న మాట. ఈ రెండింటినీ పోల్చి చూడు" అంటూ డ్రాయర్‌లోనుంచి ఒక ఇ.ఇ.జి.ని తీసి ప్రశాంత్ చేతికిచ్చాడు ప్రదీప్.

ప్రశాంత్ రెండు గ్రాఫ్‌లనూ శ్రద్ధగా చూశాడు.,

"ఈ మొదటిగ్రాఫ్ నార్మల్‌గా ఉంది. కాని ఈ రెండో ఇ.ఇ.జిలో వయొలెంట్‌ఫ్లక్చ్యువేషన్స్ కనిపిస్తున్నాయి. ఎందుచేతనో" అన్నాడు.

"ఈ కుందేలు డొమెస్టికేటెడ్ యానిమల్ ఇది మన లేబరేటరీలో మన పెంపకంలో నిర్భయంగా పెరిగింది. అందుకనే ఏ భయాలూ, వత్తిడులూ లేకుండా ఉండిన దీని మొదటి ఇ.ఇ.జి ప్రశాంతంగా, నార్మల్‌గా ఉంది. అయితే దీనికి మరో కుందేలు మెదడు అమర్చాను. దానికి అనస్థీషియా ఇవ్వడానికి పట్టుకున్నప్పుడు దానిని ఏమీ చేస్తామోనన్న భయం దాని మెదడులో గూడుకట్టుకుని ఉండిపోయి ఉండాలి. భయంతో స్పందించిన ఆ మెదడును తీసి మొదటి కుందేలుకు అమర్చాను. ఈ బ్రెయిన్ నార్మల్ ఫంక్షన్ మొదలుపెట్టాక కూడా భయతరంగాలు వెలువడుతూనే ఉన్నాయన్నమాట. అందుకనే రెండో మెదడు ఇ.ఇ.జిలో వయొలెంట్ ఫ్లక్చ్యేషన్స్ కనిపించాయి." అని వివరించాడు ప్రదీప్.

"ఎక్సలెంట్. అది సరే తొలిసారిగా క్రిస్టియన్ బార్నార్డ్ గుండె మార్పిడి చేసినప్పుడు అది ఒక అద్భుతం. కానీ ఈనాడు అది సర్వసామాన్యం. కిడ్నీ, లివర్, పాన్‌క్రియాస్ ట్రాన్స్‌ప్లాంట్‌లు కూడా సామాన్య విషయాలైపోయాయి. మరి హ్యూమన్ బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ ఇప్పటికీ ఎందుకు సాధ్యం కాలేదు?" అని అడిగాడు ప్రశాంత్.

"గుండె, కాలేయం, మూత్రపిండాలు, పాన్‌క్రియాస్‌ల విషయంలో ముఖ్యంగా కలుపవలసింది ప్రధాన రక్తనాళాల్ని. మెదడు విషయం ఇలాకాదు.మస్తిష్కంలో లక్షల సంఖ్యలో జ్ఞానేంద్రియాలకు సంబంధించిన న్యూరాన్‌లు ఉంటాయి. వీటిద్వారానే స్పందనలు కలుగుతాయి. అందువల్ల రక్త నాళాలతోపాటు, ఈ న్యూరాన్‌లకు కూడా సరియైన విధంగా జతపరుచవలసి ఉంటుంది. ఈ కలుపడంలో హెచ్చుతగ్గులు వస్తే జ్ఞానేంద్రియాలు పనిచేయవు. కొత్త మెదడు సరిగా ఇమడలేక క్రమేపీ కృశించి చివరకు ఆ వ్యక్తి ప్రాణం పోయే అవకాశం ఉంది. అందువల్లనే ఇప్పటివరకు బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ సాధ్యం కాలేదు." అని విడమరచి చెప్పాడు ప్రదీప్.

"మరి నువ్వెలా సాధ్యం చేయగలిగావు?" అని కుతూహలంగా అడిగాడు ప్రశాంత్.

"ఈనాడు మన డాక్టర్‌లు స్కల్ ఓపెన్ చేయకుండా మెదడుకి సంబంధించిన అనేకరకాల ఆపరేషన్‌లను చేయగలుగుతున్నారు. ఇందులో ప్రధానపాత్ర వహిస్తున్నవి లేజర్ కిరణాలు. కపాలం తెరవకుండానే మెదడుకి ఆపరేషన్ చేయగలుగుతున్నప్పుడు, స్కల్ ఓపెన్‌చేశాక లేజర్‌కిరణాలతో బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్‌ని నిర్దుష్టగా చేయడం సాధ్యమేననిపించింది. నా ఊహ నిజమై ఈ కుందేలు కపాలంలో కొత్తమెదడు చక్కగా అమరింది. ఏవిధమైన గాయాలు లేకుండా న్యూరాన్‌లు, రక్తనాళాలూ చక్కగా

అతుక్కున్నాయి. అందుకు 72గంటలలోపే పడుతుంది." అని వివరించాడు ప్రదీప్.

"అయితే నెక్ట్స్‌స్టెప్ ఏమిటి?" అని అడిగాడు ప్రశాంత్.

"ఇంకేముంది! హ్యూమన్ బ్రెయిన్‌ట్రాన్స్‌ప్లాంట్. నాకు ఏదైనా యాక్సిడెంట్‌లో బ్రెయిన్ బాగాదెబ్బతిని మృత్యువు ఖాయం అయినటువంటి లేదా బ్రెయిన్ కాన్సర్ వంటి వ్యాధులతో ఈ రోజో, రేపోచావు ఖాయం అనుకున్నట్టివి కాని కేసులు కావాలి. వీరికి ప్రయోగాత్మకంగా బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ చేస్తాను. అందుకోసం ఆరోగ్యంగా తాజాగా ఉన్నటువంటి మెదడు కావాలి. అటువంటివి ఎక్కడ దొరుకుతాయి? యాక్సిడెంట్‌లో సడన్‌గా చనిపోయినా బ్రెయిన్‌కి దెబ్బతగలనటువంటి కేసులలో దొరుకుతాయి. అటువంటి మెదడుతో బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ చేస్తాను. ఆ వ్యక్తి అదృష్టం బాగుండి ఆపరేషన్ సక్సెస్‌ఫుల్ అయిందా అతనికి పునర్జన్మే. సైన్స్‌కి ఘనవిజయం. ఒకవేళ ఆపరేషన్‌ఫెయిలయి ఆ వ్యక్తి మరణించినా, అతని చావు రోజుల్లోనే ఉంది కనుక ఎవరికీ బాధ అనిపించదు. కాని ఆ అనుభవం తదుపరి ఆపరేషన్స్‌కి పనికి వస్తుంది" అన్నాడు ప్రదీప్.

'ఆరోగ్యవంతమైన మెదడు అంత తేలిగ్గా దొరుకుతుందా? యాక్సిడెంట్‌లో చనిపోయినట్లు తెలిసి, ఆ బాడీని తెచ్చి మెదడు తీసి పేషెంట్ దగ్గరకు తెచ్చి, ట్రాన్స్‌ప్లాంట్ చేయడానికి సమయం ఉంటుందా?" - సందేహం వ్యక్తం చేశాడు ప్రశాంత్.

"నీ ప్రశ్న చాలా అమెచ్యూరిష్‌గా ఉంది. ఒక సైంటిస్ట్ అడగాల్సినదిగా లేదు నీపేరు ప్రశాంతే కాని ప్రశాంతంగా ఆలోచించడం లేదు" అన్నాడు ప్రదీప్ నవ్వుతూ.

ప్రశాంత్ ముఖం ముడుచుకున్నాడు. అతను హర్టయిన విషయం గ్రహించి "సీరియస్‌గా తీసుకోకు, సరదాకి అన్నాను. సైంటిస్టులకి ఆబ్సెంట్‌మైండెడ్‌గా ఉండడం మామూలేగా. నేనూ అంతే." అంటూ నవ్వాడు.

ప్రశాంత్ కూడా నవ్వాడు.

'నేత్రదానం చేయదలచుకున్న వ్యక్తులు చనిపోయినప్పుడు చనిపోయిన ఆరుగంటలలోగా వారి కన్నులను తీసి భద్రపరిచి కావలసినప్పుడు వాడుకోవడం లేదా! అలాగే యాక్సిడెంట్‌లో చనిపోయిన వ్యక్తి మెదడు డామేజి కానప్పుడు, అతను చనిపోయిన ఆరుగంటలలోగా దానిని తీసి లిక్విడ్ నైట్రోజన్‌లో భద్రపరిస్తే అటుతర్వాత ఎప్పుడైనా వాడుకోవచ్చు. సాధారణంగా యాక్సిడెంట్ జరిగినవ్యక్తి చనిపోయినప్పుడు రెండుమూడు గంటలలోనే ఆ బాడీని మార్చ్యురీకి తరలించడం జరుగుతుంది. మార్చ్యురీ ఆస్పత్రికి అనుబంధంగా ఉంటుంది కనుక ఆ ఆస్పత్రిలో ఆ వ్యక్తి మెదడును తీసి భద్రపరచగల అవకాశం ఉంటుంది. అందువల్ల ఈ విషయంలో ప్రాబ్లెం ఉండదు." అంటూ వివరించాడు ప్రదీప్.

"ఇప్పటి వరకూ ఇలా మెదడును తీసి భద్రపరిచే పద్ధతి లేదు. మరి ఈ విషయం అందరికీ తెలిసేదెలా?" అనడిగాడు ప్రశాంత్.

"మన ప్రయోగాలను వివరిస్తూ మన ఇన్‌స్టిట్యూట్ తరపున పేపర్లలో ప్రకటనలను ఇద్దాం ముఖ్యమైన హాస్పటల్స్‌కి ఉత్తరాలు రాద్దాం. పోస్టుమార్టం అయిన తర్వాత ఆరోగ్యవంతమైన మెదళ్ళను భద్రపరచి మను తెలియజేయడం కాని పంపడం కాని చేయమని రిక్వెస్టు చేద్దాం. అలాగే ఆశలు వదులుకున్న

కేసులను బ్రెయిన్‌ట్రాన్స్‌ప్లాంట్ కోసం ఐచ్ఛికంగా మనకి రిఫర్ చేయమని ప్రజలను కోరుదాం" అన్నాడు ప్రదీప్.

"గుడ్ ఐడియా. అలాగే చేద్దాం ఆల్‌దిబెస్ట్ టు యు. ఇంక నేను నా వింగ్‌కి వెళ్తాను." అంటూ లేచాడు ప్రశాంత్.

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోటెక్నాలజీలో డాక్టర్ ప్రదీప్, డాక్టర్ ప్రశాంత్‌లు రిసెర్చ్ సైన్టిస్టులు. ప్రదీప్ హ్యూమన్ ఫిజియాలజీ డిపార్టుమెంట్‌లోనూ, ప్రశాంత్ బయోకెమిస్ట్రీ శాఖలోనూ రిసెర్చి చేస్తున్నారు. ప్రదీప్ సాధించిన విజయం ప్రపంచమంతటా గొప్ప సంచలనాన్ని సృష్టించింది. వారు పత్రికలలో చేసిన ప్రకటనకి మంచి ప్రతిస్పందన వచ్చింది. ప్రమాదాలలో చనిపోయిన వ్యక్తుల శవాలకు చెందిన ఆరోగ్యవంతమైన మెదడులు రెండు నెలలలోనే ఎనిమిది వచ్చాయి. వాటిని వారి బంధువులు ఐచ్ఛికంగా దానం చేశారు.

ఆరోజున ఒక కేసు వచ్చింది. తీవ్రమైన బ్రెయిన్ కాన్సర్‌తో బాధపడుతూ రెండుమూడురోజులు కంటె బ్రతకని ఒక నడివయస్కుని వారి బంధువులు తీసుకువచ్చి ట్రాన్స్‌ప్లాంట్ కోసం అప్పజెప్పారు. ఆయన సాంప్రదాయ కుటుంబానికి చెందిన పండితుడు. పేరు రామశాస్త్రి.

డాక్టర్ ప్రదీప్ ఆధ్వర్యంలో బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ విజయవంతంగా జరిగింది. మూడురోజుల్లోనే కొత్త మెదడు చక్కగా అమరింది.

మర్నాడు రామశాస్త్రిగారికి స్పృహ వచ్చింది. తన బెడ్ దగ్గర ఉన్నవారిని వింతగా చూడసాగాడు. ఏదో భాషలో ఏమిటేమిటో అనసాగాడు. ఆయన ప్రవర్తన ఎవరికీ అర్థంకాలేదు. ఆపరేషన్ చేసిన వైద్యబృందం కంగారుపడి న్యూరోస్పెషలిస్ట్‌కి కబురు చేశారు. ఆయన వచ్చేసరికి కూడా రామశాస్త్రి ఏమిటేమిటో మాట్లాడుతున్నాడు. ఆమాటలు విన్న డాక్టర్ మెహతా "ఈయన గుజరాతీలో మాట్లాడుతున్నాడు. శాస్త్రిగారికి గుజరాతీ వచ్చా?" అని అడిగాడు స్పెషలిస్ట్ మెహతా.

"లేదండి మా నాన్నగారికి తెలుగు, సంస్కృతం తప్ప మరో భాషరాదు. గోదావరి జిల్లాలో మారుమూలగ్రామంలో ఉండడంతో కనీసం ఇంగ్లీషు కూడా ఏమాత్రం రాదు. వైద్యం కోసమే ఇక్కడికి తీసుకువచ్చాం" అన్నాడు.

డాక్టర్ మెహతా రామశాస్త్రిగారితో ఏదో మాట్లాడారు. ఆయన గుజరాతీలో మాట్లాడడంతో శాస్త్రిగారి ముఖం విప్పారింది. ముఖంలో అప్పటివరకు చోటుచేసుకున్న ఆందోళన తొలగిపోయి ప్రశాంతత ఛాయలు చోటుచేసుకోసాగాయి.

కొంచెంసేపు మాట్లాడాక ఆమన శాస్త్రిగారి బంధువులతో అన్నారు. "ఈయన తనపేరు మహమ్మద్ ఉస్మాన్ అని చెప్తున్నాడు. అహమ్మదాబాద్‌లోని ఒక మసీదులో ఇమాంగా ఉన్నాడట. ఏదో పనిమీద హైదరాబాద్‌కి వచ్చాడట. చార్మినార్ దగ్గర మక్కామసీదుకి వెళ్తున్నాడట ఆటోలో తానెక్కడున్నాడు, తనకేమైంది అని అడుగుతున్నాడు"

"అదేమిటి.... ఆపరేషన్‌లో ఏదో తిరకాసువచ్చి సంధి ప్రేలాపనలు చేస్తుండవచ్చు. ఉండండి నేనడుగుతాను." అంటూ శాస్త్రిగారి కొడుకు విశ్వం "నాన్నగారూ... నేను.. మీ విశ్వాన్ని. నన్ను గుర్తించలా.

ఇదుగో అమ్మ... సరిగ్గా చూడండి." అంటూ తండ్రితో అన్నాడు.

"ఏమండీ... నేను మీ జానకిని. ఒక్కసారి సరిగ్గా చూడండి." అంది ఆవిడ గద్గద స్వరంతో.

రామశాస్త్రిగారు అయోమయంగా చూశారు. తర్వాత డాక్టర్ మెహతా వాళ్ళు ఏమి మాట్లాడుతున్నారో తనకి అర్థం కాలేదని చెప్పాడు.

"ఈయనకి మీరు మాట్లాడేదేమీ అర్థం కాలేదు. ఈయనకి తెలుగు బొత్తిగా రాదు. ఉండండి. ఒకపని చేద్దాం." అంటూ బాయ్... ఒక మిర్రర్ తీసుకుని రా." అన్నాడు వార్డ్‌బాయ్‌తో. మరో ఐదునిమిషాలలో దగ్గర్లో ఉన్న డార్మిటరీనుంచి అద్దాన్ని తీసుకువచ్చాడు వార్డ్‌బాయ్.

ఆ అద్దాన్ని డాక్టర్ మెహతా "ఉస్మాన్‌సాబ్. ఈ అద్దంలో ఒకసారి చూడండి." అంటూ అద్దాన్ని అవ్యక్తి ముందుంచాడు.

అద్దంలో తనరూపాన్ని చూస్తూనే కెవ్వుమని కేకవేశాడు ఆ వ్యక్తి.

"ఇదేమిటి... నా రూపం ఇలా మారిపోయింది ఏమిటి? నా గడ్డం ఏది? నాకు ఈ పిలక వచ్చిందేమిటి? నా షేర్వాణీ, సుర్వా ఏమయ్యాయి? అసలు నేనెవర్ని? నాకేమయింది?" అంటూ కంగారు కంగారుగా ప్రశ్నలు కురిపించాడు. అంతలో ఆవేశం పెరిగిపోయి విరుచుకుపడి స్పృహ కోల్పోయాడు.

వెంటనే డాక్టర్ మెహతా ఆయనకి నిద్ర ఇంజక్షన్ ఇచ్చాడు. "ఆయన్ని కొంతసేపు ప్రశాంతంగా పడుకోనీయండి. ఈలోగా ఆ తర్వాత ఏంచేయాలో ఆలోచిద్దాం" అంటూ జేబులోని సెల్యూలార్ ఫోన్ తీసి కొంచెం దూరంగా వెళ్ళి ఎవరితోనో ఏదో మాట్లాడాడు మళ్ళీ వచ్చి.

"ఇది చాలా మిస్టీరియస్ కేసు. ఇప్పుడే పోలీస్‌కంట్రోల్ రూంతోనూ, ఉస్మానియా హాస్పటల్ సూపరింటెండ్‌తోనూ మాట్లాడాను. చార్మినార్ దగ్గర ఒక ఆటోయాక్సిడెంటయి ఒక వ్యక్తి అక్కడికక్కడే మరణించాడనీ ఆ బాడీకి పోస్టుమార్టం చేసి, మెదడును తీసి భద్రపరచి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయోటెక్నాలజీ కి పంపామని హాస్పిటల్ సూపరింటెండెంట్ చెప్పాడు. పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడానని అయన మృతుని దేహాన్ని తర్వాత గుర్తించామని, ఆయన పేరు మహమ్మద్ ఉస్మాన్ అనీ అహ్మాబాద్ నివాసి అని తెలిసిందనీ చెప్పారు" అన్నాడు.

"అంటే ఈయన చెప్తోంది నిజమేనన్న మాట! ఇదేమిటో అంతా గందరగోళంగా ఉంది." అన్నారు విశ్వంగారు తలగోక్కుంటూ.

"వాళ్ళిద్దర్నీ రమ్మన్నాను. వాళ్ళు వచ్చాక ఈ కేసు గురించి డిటెయిల్డ్ డిస్కషన్ చేద్దాం. యాంటీరూంలోకి పోయి మాట్లాడుకుందాం రండి. కమాన్ డాక్టర్ ప్రదీప్. యూటూ డాక్టర్ ప్రశాంత్ మీరుకూడా రండి." అని "బాయ్.. మా కోసం ఎవరు వచ్చినా మేమున్న రూమ్‌లోకి పంపించు" అని చెప్పారు.

అందరూ యాంటీరూమ్‌లోకి వెళ్ళి కూర్చున్నారు.

"డాక్టర్ ప్రదీప్... కెన్‌యూ థ్రో ఎనీలైట్ అన్‌దిస్ మిస్టరీ?"అని అడిగాడు డాక్టర్ మెహతా.

గొంతు సవరించుకున్నాడు డాక్టర్ ప్రదీప్.

"ఇది నేను ఊహించని పరిణామం డాక్టర్ మెహతా కుందేలుకి బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ చేసినప్పుడు కొత్తమెదడుతో భయాందోళనలను గమనించానే కాని భావోద్రేకాలు కనిపించలేదు. అది జంతువు కాబట్టి ఆలోచనలు, భావాలూ ఉండకపోవడవం సహజం. అయితే ఆలోచనలూ, భావాలూ, భాషా ఉన్నట్టి మానవుల మస్తిష్కాల పరిస్థితి వేరు. మనిషికి వ్యక్తిత్వాన్ని కల్పించేది మెదడే కాని దేహం కాదు అని ఇప్పుడర్థం అవుతోంది."

"అంటే మీ ఉద్దేశం..." అంటూ ఏదో చెప్పబోయాడు డాక్టర్ ప్రశాంత్.

"నన్ను పూర్తిగా చెప్పనీండి. మైక్రోఫోన్ వెనకాలున్న వ్యక్తి తెలుగులో మాట్లాడితే తెలుగు మాటలు వినిపిస్తాయి. ఏ శబ్దాలు చేస్తే ఆ శబ్దాలు వినిపిస్తాయి. మనిషి నోరు కూడా మైక్ వంటిదే. ఆ వ్యక్తి దేహంలో ఉన్నమెదడు ఏభాషలో మాట్లాడితే ఆ భాషాపదాలనే నోరు బహిర్గతం చేస్తుంది. ఇంతకుముందు రామశాస్త్రిగారి మస్తిష్కపు తెలుగు పలుకులను ఆయన నోరు పలికింది. కాని ఇప్పుడు అదేదేహంలో గుజరాతీ మాటలను నోరు వెల్లడి చేస్తోంది. అంటే ఇప్పుడు ఒక మనిషిలో దేహం ఒకరిది- వ్యక్తిత్వం మరొకరిది అయింది. ఈ వైరుధ్యాన్ని ఈ కొత్తదేహం ఎలా స్వీకరిస్తుందో ఎలా ఎడ్జస్టవుతుందో ఇప్పుడే చెప్పలేను". అన్నారాయన.

ఇంతలో ఉస్మానియా హాస్పటల్ సూపరింటెండ్ డాక్టర్ ఆత్మారాం, చార్మినార్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయరామారావు అక్కడికి వచ్చి తమని పరిచయం చేసుకున్నారు.

"గ్లాడ్ టు మీట్ యు. ప్లీజ్ బి సీటెడ్" అంటూ వారిని కూర్చోబెట్టి జరిగిన సంఘటన వివరాలు చెప్పాడు డాక్టర్ మెహతా.

"వెరీ ఇంటరెస్టింగ్" అన్నారిద్దరూ.

"డాక్టర్ ఆత్మారాం. ఐయామ్ డాక్టర్ ప్రదీప్, జస్ట్ ఒన్ క్వెశ్చన్" అంటూ ఏదో అడగబోయాడు డాక్టర్ ప్రదీప్.

"జస్ట్ ఒన్‌మినిట్ . సారీ... నేను ఇక్కడివారిని పరిచయం చేయలేదు కదూ. ఈయన డాక్టర్ ప్రదీప్. వీరు డాక్టర్ ప్రశాంత్. ఇద్దరూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బయో టెక్నాలజీలో రీసెర్చి సైంటిస్టులు. అఫ్‌కోర్సు యు నో మి. ఆయామ్ డాక్టర్ మెహతా. ఆయన మిస్టర్ విశ్వం. ఇందాక చెప్పానే.. ఆ బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ అయిన రామశాస్త్రిగారి అబ్బాయి. ఆవిడ జానకమ్మగారు. శాస్త్రిగారి భార్య." అంటూ పరిచయాలు పూర్తిచేశాడు డాక్టర్ మెహతా.

"మీ గురించి మీ సక్సెస్‌ఫుల్ బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ గురించి పేపర్స్‌లో చదివాను డాక్టర్ ప్రదీప్. గ్లాడ్‌టుమీట్‌యూ" అన్నాడు డాక్టర్ ఆత్మారాం.

"సేవిత్‌మి" అన్నాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విజయారావు.

"చెప్పండి డాక్టర్ ప్రదీప్. మీరేదో అడగబోయారు. అన్నాడు డాక్టర్ ఆత్మారాం.

"మీరు బ్రెయిన్‌ను మాకు పంపినప్పుడు ఎటాచ్‌డ్ ఫారంలో యాక్సిడెంట్ జరిగిన తేదీ, సమయం, స్థలం, పోస్టుమార్టం చేసిన తేదీ, సమయం వంటి వివరాలు ఇస్తూ అన్‌ఐడెంటిఫైడ్ బాడీ' అని రాశారు.

కాని ఈ శవం అహమ్మదాబాద్ నివాసి మహమ్మద్ ఉస్మాన్‌ది అని తెలుస్తోంది. మరి అన్‌ఐడైంటిఫైడ్ అని ఎలా రాశారు?" అని అడిగాడు డాక్టర్ ప్రదీప్.

"నిజమే. ఆ శవం మాకు గుర్తుతెలియనిదిగానే వచ్చింది. రికార్డ్స్‌లో అలాగే నమోదయింది. గుర్తు తెలియని శవం కావడంతో. తలకి గాయాలు కాకపోవడంతో మెదడుని తీసి భద్రపరిచి ఆ తర్వాత మీకు పంపాం." అన్నాడు డాక్టర్ ఆత్మారాం.

"మీ ప్రశ్నకు సమాధానం నేను చెప్తాను." అన్నాడు విజయారావు. అందరూ అటు చూశారు.

"యాక్సిడెంట్ అయినప్పుడు ఆటోనుజ్జునుజ్జు అయింది. ఆటో డ్రైవర్‌తీవ్రగాయాలై ఆస్పత్రిలో ఉన్నాడు. ఇప్పటికీ కోమాలోనే ఉన్నాడు. ఆటోలో ఈ శవం లభ్యం అయినా సమయానికి ఆయన గురించిన వివరాలేవీ మాకు దొరకలేదు. అందుకే గుర్తుతెలియని శవంగా ఆస్పత్రికి పంపాం. అక్కడ అలాగే నమోదైంది. అయితే ఆ తర్వాత తుక్కుతుక్కయిన ఆటోను పరీక్షిస్తుంటే సీటు వెనకాల ఇరుక్కుని అతని హాండ్‌బాగ్ దొరికింది. అందులో ఆయన పేరూ, అతని అడ్రసూ, కొన్ని కాగితాలూ, సుమారు వేయిరూపాయల నగదూ ఉన్నాయి. ఆ వ్యక్తి ఎవరో తెలియడంతో ఆ వివరాలు ఆస్పత్రికి పంపాం. అహ్మదాబాద్‌లోని అతని కుటుంబీకులకి తెలుపవలసిందిగా అక్కడి పోలీస్ స్టేషన్‌కి వైర్‌లెస్ మెజేజ్ పంపించాం" అన్నాడాయన.

"అలాగా... అయితే మార్చ్యురీలో రికార్డ్స్‌లో ఈ వివరాలు ఎక్కుంటాయి. అది వేరే డిపార్టుమెంటు కావడంతో ఆ వివరాలు నాకు తెలీదు." అన్నాడు డాక్టర్ ఆత్మారాం.

"ఎక్కాయి. మా మెసేజ్ అందుకుని నిన్న అతని భార్య, కొడుకు వచ్చి నన్ను కలిశారు. శవం ఉస్మానియా మార్చ్యురీలో ఉందని తెలిపి ఆయన వస్తువులు క్లెయించేయడానికి కావలసిన ఫారంలు ఇచ్చాను. వాళ్ళు శవాన్ని ఇక్కడే ఖననం చేసి వెళ్తామని చెప్పారు. ఈ ప్రమాదానికి ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా రావచ్చుననీ, అందుకు అప్లైచేయమనీ, ఈరోజు వచ్చి నన్ను కలవమనీ చెప్పాను. ఇప్పుడో మరికొంచెం సేపట్లోనే రావచ్చు. వాళ్ళు వస్తే ఇక్కడికి పంపమని చెప్పి వచ్చాను." అని చెప్పాడు విజయారావు.

ఇంతలో వార్డ్ బాయ్ వచ్చి బురఖావేసుకున్న ఒక ముస్లిం స్త్రీని, ఒక యువకుడినీ ప్రవేశపెట్టాడు.

ఆ స్త్రీ విజయారావుని చూస్తూనే "ఆదాబ్ సాబ్" అంది. ఆ యువకుడు "ఆదాబ్‌సాబ్... అస్సాలామాలేకుం " అన్నాడు.

"ఆయియే ఉదర్‌బైటీయే " అని కుర్చీలు చూపించి

"ఇదుగో మాటల్లోనే వచ్చారు. ఈవిడ పర్వీన్ బేగం. చనిపోయిన మహమ్మద్ ఉస్మాన్ భార్య. ఈతను ఆయన కొడుకు అక్రం" అంటూ పరిచయం చేశాడు. వాళ్ళు అందరి వైపూ చూస్తూ చేయి ఎత్తి అభివాదం చేశారు.

"ఉస్మాన్‌సాబ్ లాష్ తీసుకుపోయారా?' అని అడిగాడు విజయారావుగారు.

"హాఁసాబ్. నిన్ననే తీసుకుని ఈ నగరంలోనే ఖననం చేశాం. బడీ అఫ్‌సోస్‌కీ బాత్‌హై సాబ్" అన్నాడు అక్రం. మీరు ఉస్మాన్ ఆవాజ్‌ను గుర్తుపట్టారు కదూ?" అని అడిగాడు విజయారావు.

"అదేమిటి సాబ్. అలా అడిగారు?" అన్నాడు అక్రం.

"ఏం లేదు " అన్నాడు విజయారావు.

"సార్... ఆ పేషెంట్‌కి మళ్ళీ స్పృహవచ్చింది. ఏమిటేమిటో మాట్లాడుతున్నాడు. మనిషి బాగా ఆవేశంగా ఉన్నాడు".అంటూ వచ్చి డాక్టర్ మెహతాకి చెప్పాడు వార్డ్‌బాయ్.

"అరే అప్పుడే తెలివి వచ్చిందా! ఎమోషన్స్ చాలా ఎక్కువగా ఉన్నాయన్న మాట అందుకే నిద్ర ఇంజక్షన్ ఎఫెక్టు తగ్గినట్లుంది. " అంటూ లేచాడు డాక్టర్ మెహతా.

తాను కూడా లేస్తూ అక్కడున్నవారిని "మీరు కూడా రండి" అన్నాడు విజయారావు.

అందరూ రామశాస్త్రి బెడ్‌వద్దకు వెళ్ళారు. ఆయన గుజరాతీలో ఏదేదో అంటున్నాడు.

పర్వీన్ కంటబడగానే "బేగంజాన్. కైసేహో" అన్నాడు. రామశాస్త్రి విప్పారిన కన్నులతో.

ప్రక్కనున్న అక్రంను చూచి "అక్రం మియా.. తుంభీ ఆయే" అన్నాడు ఆనందాతిరేకంతో.

పర్వీన్, అక్రంలు కంగారుగా ఆయన వంక చూసి తర్వాత ఒకరిముఖాలొకరు చూసుకున్నారు.

"బీబీజాన్ ముఝే పెహచానా నహీ, క్యాహువా ఆప్‌సబ్‌కూ, క్యాహువా ముఝే" అని మళ్ళీ అడిగాడు రామశాస్త్రి.

"ఆప్‌కౌన్‌హో" అంది ఫర్వీన్.

"మై కౌన్‌హూం! తేరీమరద్‌కు నహీ పెహచాన్‌తా" అంటూ ఆవేశంగా అరిచి మళ్ళీ స్పృహకోల్పోయాడు రామశాస్త్రి.

"ఏ సబ్‌క్యా హై సాబ్? ఇనోకౌన్ హై" అంది పర్వీన్ విజయారావు వంక చూస్తూ.

"చెప్తాను... మీరు ఆయన గొంతును గుర్తు పట్టారా" అని అడిగాడు విజయారావు.

"ఆయన మాటతీరు సరిగ్గా మా నాయనది లాగే ఉంది. అయితే గొంతు శబ్దంలో తేడా ఉంది. ఇంతకీ ఈయన ఎవరు సాబ్" అని అడిగాడు అక్రం.

ఈలోగా డాక్టర్ మెహతా రామశాస్త్రిగారికి మరో స్ట్రాంగ్‌డోస్ సెడేటివ్ ఇంజక్షన్ ఇచ్చాడు. ఆయన గాఢనిద్రలోకి జారుకున్నారు.

"రండి.. మనందరం మళ్ళీ అక్కడికి పోయి మాట్లాడుకుందాం." అంటూ దారి తీశాడు. తిరిగి అందరూ ఆ యాంటీ రూంలో సమావేశమయ్యారు.

అందరూ కూర్చున్నాక "ఏ సబ్‌క్యాహైసాబ్" అని అడిగింది పర్వీన్ బేగం విజయారావుని.

"మీరు బెడ్ మీద చూసిన పేషెంట్ పేరు రామశాస్త్రి. బ్రెయిన్ కాన్సర్‌తో బాధపడుతూ చనిపోయే స్థితికి వచ్చాడు. అందువల్ల ఆయనకి బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ చేశారు. అంటే ఆయన మెదడును తొలగించి దాని స్థానంలో ప్రమాదంలో చనిపోయిన ఉస్మాన్ సాబ్ మెదడును పెట్టారు. రామశాస్త్రిగారు బ్రతికారు. అయితే ఉస్మాన్‌సాబ్‌గా. మెదడు ఉస్మాన్‌సాబ్‌ది కనుక ఆయన తన వాళ్ళని అంటే మిమ్మల్ని గుర్తించి మాట్లాడాడు. అయితే దేహం శాస్త్రిగారిది కావడంతో మీరు ఆయన్ని గుర్తించలేకపోయారు." అంటూ

వివరించాడు విజయారావు.

"వో కైసాహోతా సాబ్?" అంది పర్వీన్ కోపంగా.

"మా అంగీకారం లేకుండా మా నాయన మెదడును ఎలా తీశారు సాబ్?" అన్నాడు అక్రం ఆవేశంగా.

"ఆవేశపడకండి. ఉస్మాన్‌సాబ్ యాక్సిడెంట్‌లో చనిపోయినప్పుడు ఆయనెవరో తెలియలేదు. గుర్తుతెలియని శవంగానే ఆయన శవాన్ని మా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆరోగ్యవంతంగా ఉన్న ఆయన మెదడు మరొకరికి ప్రాణదానం చేస్తుందన్న నమ్మకంతో దానిని తీసి డాక్టర్ ప్రదీప్ గారికి పంపారు. దానిని రామశాస్త్రిగారికి అమర్చడం జరిగింది. ఆ తర్వాతనే మహమ్మద్ ఉస్మాన్‌సాబ్‌ని గుర్తించడం జరిగింది. ఉస్మాన్‌సాబ్ చనిపోయినా ఇంకొకరిని బ్రతికించారు." అంటూ సవివరంగా తెలియజేశాడు డాక్టర్ ఆత్మారాం.

"ఇప్పుడు ఏమిటి చేయడం?" అంది పర్వీన్ ఆందోళనగా.

"ఆయన ఆకారం రామశాస్త్రిగారిదైనా మనిషిమాత్రం మహమ్మద్ ఉస్మాన్‌గారే. ఆయన ఉస్మాన్‌సాబ్‌గానే బ్రతకగలరు. మీతోనే జీవించగలరు. అయితే ఈ కొత్తరూపంలో అడ్జస్టు కావడానికి ఆయనకీ, మీకూ కూడా కొంతకాలం పట్టుంది." అన్నాడు డాక్టర్ మెహతా.

నై...నై... ఐసాకైసా హోతా" అంటూ రుసరుసలాడింది పర్వీన్‌బేగం. అదెల్లా కుదురుతుంది సాబ్! మా నాయన లాష్‌ని పాతిపెట్టినాం కూడా. ఇంక మా నాయనెక్కడున్నాడు? ఆయన చనిపోయాడు. ఈ శాస్త్రీజీ, గీస్త్రీజీతో మాకేం సంబంధంలేదు" అన్నాడు అక్రం.

"హాఁ మాకేమీ రిస్తాలేదు మేం పోతున్నాం. బహుత్ బహుత్ షుక్రియా." అంటూ రుసరుసలాడుతూ బయటకు నడిచింది పర్వీన్. వెనకాలే అక్రం కూడా వెళ్ళాడు.

ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. వారి దయనీయ పరిస్థితి అర్థం అవుతూనే ఉంది. వారిని వారించీ ప్రయోజనం లేదని ఊరుకున్నారు.

భారంగా నిట్టూర్చాడు డాక్టర్ మెహతా.

"విశ్వంగారూ... మీరే మంటారు? ఈయన్ని తీసుకువెళ్తే మీ నాన్నగారు మీ కళ్ళముందు కదలాడుతున్నట్లే ఉంటుంది. అయితే ఆయన మహమ్మద్ ఉస్మాన్‌నుంచి రామశాస్త్రిగా మారడానికి చాలాకాలం పట్టవచ్చు. మీరు ఓపిగ్గా, సహనంతో నెమ్మది నెమ్మదిగా రామశాస్త్రిగారి అలవాట్లు, ఆచారాలు, ఆలోచనలు, పద్ధతులూ అలవాటు చేయవలసి ఉంటుంది. మీయత్నం ఫలించవచ్చు కాని గ్యారంటీగా చెప్పలేం. ఆయన మహమ్మద్ ఉస్మాన్‌గా భావించుకుని ఇంట్లోంచి పారిపోనూవచ్చు. నిత్యం సమస్యలు సృష్టిస్తూ ఉండవచ్చు. వీటన్నిటినీ మీరు భరించవలసి ఉంటుంది" అన్నాడు డాక్టర్ మెహతా.

"మా వారి రూపం ఉన్నా మనిషి ఆయన కానప్పుడు ఆయన్ని మేం ఎలా స్వీకరించగలం?" అంది జానకమ్మ.

"ఆయన్ని మానాన్నగారుగా అంగీకరించడం అసంభవం. అదిసరే. మనిషికి వ్యక్తిత్వాన్ని కల్పించేది మెదడన్నారు. మరి తొలగించిన మా నాన్నగారి మెదడు ఎక్కడుంది" అని అడిగాడు విశ్వం.

"మామూలుగా అయితే ఆపరేషన్ అయిపోయాక వ్యర్థమైనవాటి నన్నీ పాతిపెట్తాం. కాని కొన్ని వైద్య పరీక్షల కోసం ఆ మెదడుని భద్రపరిచాం. ఎందుకలా అడిగారు?" అన్నాడు డాక్టర్ మెహతా.

"మా దృష్టిలో మా నాన్నగారు చనిపోయారు. అందుచేత ఆమెదడును మాకిచ్చేయండి. దానికి దహనసంస్కారాలు చేస్తాం. మరో వ్యక్తి మెదడుకు చోటిచ్చిన ఈ దేహంతో మాకు సంబంధం లేదు" అన్నాడు విశ్వం.

"సరే మీ ఇష్టం. అది మీకు చెందింది. రేపే దానిని మీకు ఇచ్చే ఏర్పాట్లు చేస్తాను." అన్నాడు డాక్టర్ మెహతా.

"అలాగే రేపు వచ్చి కలుస్తాను." అన్నాడు విశ్వం.

"మీరు డాక్టర్ ప్రదీప్‌ని కలవండి." అని ప్రదీప్‌తో "డాక్టర్ ప్రదీప్ అది మీ లాబ్‌లోనే ఉందిగా దానిని వీరికి ఇచ్చివేయండి" అన్నాడు.

"అలాగే మీరు రేపు కలవండి" అన్నాడు ప్రదీప్.

విశ్వం, జానకమ్మగారు వెళ్ళిపోయారు.

"డాక్టర్ ఆత్మారాం. ఇన్‌స్పెక్టర్ విజయారావులుకూడా వెళ్ళిపోయారు. అవసరమైతే కబురు చేయమని చెప్పు.

"ఇప్పుడు చాలా విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. ఈయన్ని అటు రామశాస్త్రిగారి మనుష్యులూ, ఇటు ఉస్మాన్‌సాబ్ మనుష్యులూ వదిలేశారు. ఇప్పుడు ఈయన ఏమైపోతాడు. ఎలా జీవిస్తాడు? అసలు ఈ సంఘర్షణని తట్టుకోగలడా?" అన్నాడు డాక్టర్ ప్రశాంత్.

"నిజమే. ఈయన కోలుకున్నాక అసలు తన రూపంతో రాజీపడలేడు. అయినా మనసు పీకుతుంది. కనుక అహ్మదాబాద్ వెళ్తాడు కాని అక్కడ వాళ్ళు ఈయన్ని తన్ని తగలేస్తారు. నిజానికి ఈయనది చాలా దారుణమైన పరిస్థితి. " అన్నాడు డాక్టర్ మెహతా.

"ఈ పరిణామం నేను ఊహించలేదు. బ్రెయిన్‌ట్రాన్స్‌ప్లాంట్ సక్సెస్‌ఫుల్‌గా జరిగినా, వ్యక్తిత్వానికీ దేహానికీ సంఘర్షణ తప్పదు. ఈ సంఘర్షణలో మానసికంగా దెబ్బతిన్న ఆ వ్యక్తిఎక్కువరోజులు బ్రతక్కపోవచ్చు. వైజ్ఞానిక పరంగా మనం విజయం సాధించినా వాస్తవంలో మెదడు మార్పిడి అపజయం పొందక తప్పదనే అన్పిస్తోంది." అన్నాడు డాక్టర్ ప్రదీప్.

"సార్... రామశాస్త్రిగారి పరిస్థితి క్షీణిస్తోంది. పల్స్ రేట్ బి.పి. పడిపోతున్నాయి. డ్యూటీ డాక్టర్‌కి కబురుచేసి ఇటొచ్చాను. అంటూ వచ్చింది డ్యూటీలో ఉన్న నర్స్.

"మైగాడ్..." అంటూ చకచకా ముందుకి వెళ్ళాడు డాక్టర్ మెహతా. ఆయన వెనకే డాక్టర్ ప్రదీప్, డాక్టర్ ప్రశాంత్‌లు కూడా వెళ్ళారు. వాళ్ళు వెళ్ళేసరికి డ్యూటీ డాక్టర్ వచ్చి పేషెంట్ బి.పి. చెక్ చేస్తున్నాడు. బి.పి ఆపరేటస్‌ను తాను అందుకున్నాడు డాక్టర్ మెహతా బి.పి ఒకపక్క పడిపోతున్నా ఉన్నట్లుండి తీవ్రమై ఫ్లక్స్యువేషన్స్ వస్తున్నాయి. పల్స్‌రేటులో కూడా ఆకస్మికంగా మార్పులు కలుగుతున్నాయి.

"ఈయనకి సెడేటివ్ ఇచ్చి నిద్రపుచ్చినా మానసికంగా తీవ్రమైన ఆందోళనతో కొట్టుమిట్టాడు

తున్నాడు. సహజంగా అది ఈయన బ్లడ్ ప్రెషర్ మీద పనిచేస్తుంది. " అన్నాడు డాక్టర్ మెహతా.

ఇంతలో ఉన్నట్లుండి పైకి లేచాడు రామశాస్త్రిగారు పట్టరాని ఆవేశంతో.

"నా భార్య, నా కొడుకు నన్ను గుర్తుపట్టడంలేదు నేనెవరంటున్నారు, వాళ్ళకేమైంది? అసలు నాకేమైంది? నా రూపం మారిపోయింది." అంటూ అరవసాగాడు.

"మళ్ళీ సెడెటివ్ ఇంజక్షన్ ఇయ్యమంటారా?" అని అడిగాడు డ్యూటీడాక్టర్.

"వద్దు.. కొంచెం సేపు అరిస్తే ఆయన ఆవేశం చల్లారుతుంది. ఆ తర్వాత నెమ్మదిగా జరిగిన విషయం ఆయనకి చెప్పి, కొత్తజీవితానికి రాజీపడవలసిందిగా నచ్చచెప్పాలి." అన్నాడు డాక్టర్ మెహతా.

రామశాస్త్రిగారు అరుస్తూనే ఉన్నాడు.

"ఒక విషయం నాకూ అర్థం కావడంలేదు. ఈయన కొంతసేపు గుజరాతీలో, కొంతసేపు ఉర్దూలో మాట్లాడుతున్నాడు. ఇలా ఎందుకు చేస్తున్నాడు." అన్నాడు డాక్టర్ ప్రశాంత్.

"సింపుల్. గుజరాత్‌లో చాలామంది ముస్లింలకు మాతృభాష గుజరాతీయే. కొద్దిమంది మాత్రం ఇళ్ళల్లో ఉర్దూ మాట్లాడతారు. వ్యాపారం చేసే వారికీ, ఎక్కువగా టూర్‌లలో ఉండేవారికీ మతపరమైన కార్యకలాపాలు నిర్వహించేవారికీ ఉర్దూ బాగా వస్తుంది. ఉస్మాన్‌సాబ్ మసీదులో ఇమాం కనుక సహజంగా ఉర్దూ వస్తుంది. ఇంట్లోకూడా వాళ్ళు ఉర్దూనే మాట్లాడుతారన్నమాట. అందుకే భార్య కొడుకులని చూసినప్పుడు ఉర్దూలో మాట్లాడాడు. మనల్ని చూసినప్పుడు మనం బయటివారమన్న ఉద్దేశంతో గుజరాతీలో మాట్లాడాడు. ఇప్పుడు అంతర్మథనం చెందుతున్నాడు కాబట్టి ఆయన ఆలోచనలు ఉర్దూలోనే బహిర్గతం అవుతున్నాయి. " అని వివరించాడు డాక్టర్ మెహతా. ఉస్మాన్‌గారి ఆవేశం కట్టలు తెంచుకుంటోంది. అప్పటివరకూ అరుపులు, కేకలూ వేస్తున్నవాడు ఆవేశంతో ఊగిపోవడం మొదలుపెట్టాడు. ముఖం ఎర్రబారిపోతోంది. కళ్ళు ఉబ్బాయి. ఉచ్ఛ్వాశ నిశ్వాసాలు తీవ్రంగా వస్తున్నాయి. వాటివేడి ప్రక్కనున్న డాక్టర్ మెహతాకి తగులుతోంది.

"లాభం లేదు. మీరు సెడెటివ్ ఇంజక్షన్ ఇచ్చేయండి. " అన్నాడు డాక్టర్ మెహతా డ్యూటీ డాక్టర్‌తో.

ఆయన ఇంజక్షన్ తెచ్చేలోపలే పెద్ద అరుపు అరిచి వెనక్కు విరుచుకు పడిపోయాడు రామశాస్త్రి. అరుపులు ఆగిపోయాయి కళ్ళు తేలిపోయాయి.

డాక్టర్ మెహతా కంగారుగా రామశాస్త్రి నాడిని చూశాడు ఆ తరువాత స్టెతస్కోప్‌తో ఆయన గుండెను పరీక్షించాడు, ఆయన పరీక్షిస్తుండగానే శాస్త్రిగారి గుండె ఆగిపోయింది. తుది శ్వాస విడిచాడు.

"మైగాడ్! హిఈజ్ నోమోర్ పూర్‌ఫెలో ఆవేశం తట్టుకోలేక పోయాడు" అన్నాడు

"వెరీ ట్రాజిక్ ఎండ్." అన్నాడు డాక్టర్ ప్రదీప్.

"మీరు కొంచెం సేపుండి, ఈ డెడ్‌బాడీని మార్చ్యురీకి పంపించండి" అన్నాడు డ్యూటీడాక్టర్‌తో డాక్టర్ మెహతా.

"రండి మనం రూంలో కూర్చుని మాట్లాడుకుందాం" అన్నాడు ప్రదీప్, ప్రశాంత్‌ల వంక చూస్తూ.

ముగ్గురూ మళ్ళీ రూంలో సమావేశమయ్యారు.

" ఈ సంఘటన చూస్తుంటే "ఆపరేషన్ సక్సెస్‌ఫుల్ బట్ ది పేషెంట్ డైడ్," అన్న సామెత గుర్తుకు వస్తోంది" అన్నాడు ప్రశాంత్.

ఆ సీరియస్ సిట్యుయేషన్‌లో కూడా ముగ్గురికీ నవ్వువచ్చింది.

"నువ్వన్నట్లు బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్స్‌ని సక్సెస్‌ఫుల్‌గా చేయగలగవచ్చు, కానీ వాటివల్ల సమస్యలతోపాటు సత్ఫలితాలూ ఉండవు. అని అనిపిస్తోంది" అన్నాడు డాక్టర్ ప్రదీప్.

"ఈయన బాడీకి పోస్టుమార్టం చేద్దాం. ఈయన మృతికి కేవలం ఉద్రేకమేనా, వేరే కారణాలు కూడా ఉన్నాయా అన్న విషయం తెలుతుంది. ఈలోగా పోస్ట్‌మార్టం ఆఫ్ ఈవెంట్స్ చేద్దాం". అన్నాడు డాక్టర్ మెహతా.

డాక్టర్ ప్రదీప్,ప్రశాంత్‌లు ఆయన వంక ప్రశ్నార్థకంగా చూశారు.

"అవును జరిగిన సంఘటనలను విశ్లేషించడం కూడా అవసరమే. ఈ మహమ్మద్ ఉస్మాన్ అహ్మదాబాద్ నుంచి హైదరాబాద్‌కి వచ్చాడు. చార్మినార్ దగ్గరున్న మసీదుకి ఆటోలో వెళ్తున్నాడు. అకస్మాత్తుగా ప్రమాదం జరిగి తక్షణం ప్రాణం కోల్పోయాడు. ఈ సంఘటన అకస్మాత్తుగా జరగడంతో ఆయనకి హైద్రాబాద్ రావడం, ఆటోలో వెళ్తుండడం వరకే గుర్తుంది. అందుకే రామశాస్త్రి దేహంలో స్పృహ వచ్చాక తన ఆటో ప్రయాణం వరకూ చెప్పి, ఆ తర్వాత ఏం జరిగిందని మనల్ని అడుగుతున్నాడు. తన రూపం మారిపోయినందుకు కంగారు పడ్తున్నాడు కాని, మహమ్మద్ ఉస్మాన్‌గా తాను. మరణించిన విషయం తిరిగి రామశాస్త్రి విషయంలో జీవించిన విషయం అతనికి తెలియదు. తెలుసుకోలేడు. ఇప్పుడు చెప్పినా అర్థం కాదు. ఈయనకి ఆవేశం తగ్గి విషయం అంతా తెలుసున్నా రాజీపడినా, తనని తనవారూ, పెరవారూ కూడా స్వీకరించక తిరస్కరించడం తథ్యం కనుక, దారుణమైన మానసిక వేదనకు లోనవుతాడు. ఆ చిత్రవధను తట్టుకోలేక కృంగికృశించి కొద్దికాలంలోనే చనిపోకతప్పదు. ఈ పరిస్థితి ఈయనకే కాదు. బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్ జరిగిన ఎవరికైనా తప్పదు. ఒక వేళ పురుషుని కపాలంలో స్త్రీ మెదడుని కాని, స్త్రీ శిరంలో పురుషుని మెదడునికాని ఉంచి బ్రెయిన్‌ట్రాన్స్‌ప్లాంట్ చేస్తే ఆ ఫలితాలు ఇంకా దారుణంగా ఉంటాయి. ఎందుకంటే వ్యక్తిత్వం, దేహం మధ్య సంఘర్షణే కాకుండా, స్త్రీ పురుష మానసిక తత్వాలలో ఉండే తేడా వల్ల కూడా కొత్త సమస్యలు ఎదురవుతాయి. రెండు విధాలుగా భయంకరమైన పరిణామాలు ఎదురవుతాయి. అందువల్ల ఇంక మనం ఈ బ్రెయిన్‌ట్రాన్స్‌ప్లాంట్‌లకి ఫుల్‌స్టాప్ పెట్టడం మంచిది." అన్నాడు డాక్టర్‌మెహతా.

"మీ అభిప్రాయాలతో నేను ఏకీభవిస్తున్నాను. అది సరే. ఇప్పుడు ఈ శవాన్ని ఏం చేయడం. అటు ఉస్మాన్‌మనుష్యులు, ఇటు రామశాస్త్రిగారి వాళ్ళూ మాకు సంబంధంలేదంటే మాకు సంబంధం లేదంటూ వెళ్ళిపోయారు. అందరూ ఉండికూడా దిక్కులేని శవంలాగా పూడ్చిపెట్టడమేనా? మెదడు ఉస్మాన్‌ది కనుక పూడ్చడమా? శాస్త్రిగారి దేహం కనుక కాల్చడమా? ఇవి కొత్త సమస్యలు" అన్నాడు డాక్టర్ ప్రదీప్.

"దోమాడ కరణం బతికి బాధించాడు, చచ్చి సాధించాడు' అన్న సామెత గుర్తుకు వస్తోంది నాకు" అన్నాడు ప్రశాంత్. ఇద్దరూ నవ్వారు ఆ మాటలకు.

"ఈ శవాన్ని కాల్చావద్దు, పూడ్చావద్దు. దీనిని మెడికల్ మ్యూజియంలో ఎగ్జిబిట్‌గా ఉంచుదాం. మాస్కోలో లెనిన్ మృతదేహం, గోవాలో సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ శవం ఉన్నట్లు, బ్రెయిన్ ట్రాన్స్‌ప్లాంట్‌కి మెమోరియల్‌గా ఉండి సందర్శకుల నాకర్షిస్తుంటుంది. విజ్ఞాన శాస్త్రంలో విజయాలే కాదు వాటి వెనుక అపశ్రుతులు కూడా ఉండవచ్చునని గుర్తుచేస్తుంటుంది" అన్నాడు డాక్టర్ మెహతా.

"మీ ఐడియా బాగుంది. అలాగే చేద్దాం" అన్నాడు ప్రదీప్.

"కాగల కార్యం గంధర్వులే తీర్చారన్నట్లు, కావలసిన కార్యాన్ని డాక్టర్ మెహతా సూచించారు." అన్నాడు ప్రశాంత్.

ముగ్గురూ నవ్వుకున్నారు.

"టెన్షన్స్ మధ్య గడిపే మన మెడికల్ ప్రొఫెషన్‌లో మీ వంటివారి జోక్స్ మంచి రిలీఫ్". అన్నాడు డాక్టర్ మెహతా.

ముగ్గురూ మళ్ళీ నవ్వుకున్నారు.

ఆంధ్రప్రభ వారపత్రిక, 23-10-2000 ✪